క్లుప్తంగా

పేదలకు దుస్తుల పంపిణీ



డోర్నకల్: స్థానిక జైన్ భవన్‌లో ఆదివారం హెల్పింగ్ హ్యాండ్స్ పేరుతో పేదలకు దుస్తుల తోపాటు ఇతర వస్తువులను పంపిణీ చేశారు. జైన మతానికి చెందిన పెద్దలు మహేందర్‌జైన్, కిషోర్‌కుమార్‌జైన్, చిరంజీలాల్, వార్డు కౌన్సిలర్ కాలా మోనికాజైన్, రేణుకాజైన్ తదితరులు మున్సిపాలిటీ పారిశుద్ధ్య సిబ్బంది తోపాటు పేదలకు దుస్తులతో పాటు ఇతర వస్తువులను పంపిణీ చేశారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి



కురవి: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 'ప్రేమ తరువు' కార్యక్రమాన్ని శ్రీసత్యసాయి సేవలో భాగంగా మండల కేంద్రంలోని శ్రీసత్యసాయి సమితి ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటారు. ఈసందర్భంగా శ్రీ సత్యసాయి సేవాసమితి కన్వీనర్ సీహెచ్ శ్రీనివాస్ ప్రతి ఒక్కరికి ఒక్కో పూల మొక్క అందజేసి నాటించారు.

వైద్యరత్న అవార్డు ప్రదానం



గార్ల: గార్ల సీహెచ్‌సీలో వైద్యుడిగా పనిచేస్తున్న డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా వైద్యరత్న అవార్డును అందుకున్నారు. జాతీయ డాక్టర్స్ దినోత్సవంను పురస్కరించుకొని హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో వైద్యంలో నిరుపేదలకు ఉత్తమ సేవలు అందిస్తూ, సమాజ శ్రేయస్సు కోసం పాటుపడుతున్న జాదవ్ సేవలను ప్రభుత్వం గుర్తించి వైద్య రత్న అవార్డును ప్రదానం చేసింది.

పిచ్చి మొక్కల తొలగింపు



డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న తెలిపారు. మున్సిపాలిటీ ఐదో వార్డు పరిధిలోని సోమ్లాతండా శివారులో ఆదివారం పిచ్చి మొక్కల తొలగింపు పనులను చైర్మన్ వీరన్న ప్రారంభించారు.

రచయితకు సన్మానం



కొత్తగూడ: ఆదివాసీ రచయిత గుమ్మడి లక్ష్మీనారాయణను ఎమ్మెల్సీ రవీందర్‌రావు, జిల్లా కలెక్టర్ శశాంక సన్మానించారు. తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ముద్రించిన మహబూబాబాద్ సమగ్ర స్వరూపం అనే పుస్తకాన్ని కలెక్టర్ సమావేశ భవనంలో ఆవిష్కరించారు. పుస్తక రచనలో పాల్గొని తనదైన శైలిని అందించిన పాగుళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆదివాసి రచయిత గుమ్మడి లక్ష్మీనారాయణను సన్మానించారు.

తప్పిపోయిన వృద్ధుడికి 'ఆసరా'

గీసుకొండ : గ్రామం నుంచి కొన్ని నెలల క్రితం తప్పిపోయి భద్రాద్రి కొత్తగూడేనికి చేరుకున్న వృద్ధుడి సమాచారం తెలుసుకుని అతడిని ఆత్మీయంగా పలకరించి నేనున్నానంటూ భరోసా ఇచ్చారు.. మరియపురం సర్పంచ్ అల్లం బాలిరెడ్డి. గీసుకొండ మండలం మరియపురం గ్రామానికి చెందిన కొంపెల్లి లక్ష్మీనర్సయ్య అనే 90 ఏళ్ల వృద్ధుడు కొన్ని నెలల క్రితం సింగరేణి రైలెక్కి భద్రాద్రి కొత్తగూడెం స్టేషన్‌లో దిగడంతో తప్పిపోయి వచ్చిన అతడిని అక్కడి పోలీసులు స్థానిక శ్రీజ్యోతి అనాథ ఆశ్రమం వారికి అప్పగించారు. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ ప్రతినెలా అతడికి వచ్చే ఆసరా పింఛన్‌ను ఆశ్రమం వారికి పంపిస్తున్నారు. కాగా ఆదివారం ఆశ్రమానికి వెళ్లి వృద్ధుడిని పలకరించి అతడి యోగక్షేమాలను తెలుసుకోవడంతో పాటు ఏ లోటు రానియొద్దని తాను అన్ని విధాల అండగా ఉంటానని సర్పంచ్ భరోసా ఇచ్చారు. అలాగే ఆశ్రమానికి రూ.50 వేల ఆర్థికసాయం అందించారు. మరియపురం వాసి గోపు లూర్దు మర్రెడ్డి, నల్లబెల్లి ఎంపీఓ కూచన ప్రకాశ్ పాల్గొన్నారు.

ఖమ్మం సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా హాజరుకాగా ఖమ్మంలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి అధ్యక్షతన పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిక సందర్భంగా ఏర్పాటు చేసిన తెలంగాణ జనగర్జన మహాసభకు జిల్లా వ్యాప్తంగా నుంచి వేలాది మంది కాంగ్రెస్ శ్రేణులు వాహనాల్లో ఆదివారం వెళ్లారు. జిల్లా కేంద్ర నుంచి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడుజెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ మహబూబాబాద్ నియోజకవర్గ బాధ్యులు డాక్టర్ భూక్యా మురళీనాయక్ నాయకత్వంలో కాంగ్రెస్ శ్రేణులు వాహనాల్లో ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. అన్ని మండలాల నుంచి వాహనాల్లో కాంగ్రెస్ శ్రేణులు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియానికి చేరుకోగా కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్ జెండా ఊపి ప్రారంభించారు. - సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ రూరల్: ఖమ్మం సభకు ర్యాలీగా వెళ్తున్న బలరాంనాయక్, తదితరులు



మహబూబాబాద్ రూరల్: సభకు వెళ్తున్న నాయకులు



కేసముద్రం: ఖమ్మం సభకు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు



తొర్రూరు నుంచి..



బయ్యారం: కాచనపల్లి నుంచి..



నెల్లికుదురు: మండల కేంద్రంలో..



మరిపెడ నుంచి..



కురవి నుంచి..



మరిపెడ రూరల్: అబ్బాయిపాలెం నుంచి..



పెద్దవంగర: చిన్నవంగర నుంచి..



గూడూరు నుంచి..



గంగారంలో..

5న స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశాలకు ఎంపికలు

కురవి/డోర్నకల్/మరిపెడ రూరల్ /గార్ల బయ్యారం: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ మైదానంలో ఈనెల 5వ తేదీన మండల స్థాయి స్పోర్ట్స్ స్కూల్ అడ్మిషన్ల కోసం ఎంపిక జరుగుతుందని ఎంఈఓ పూల్‌చంద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబర్ 1వ తేదీ 2013 నుంచి 2014 ఆగస్టు 31వ తేదీ మధ్యలో పుట్టిన బాలబాలికలు 4వ తరగతిలో, 2012 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ 2013 సంవత్సరం మధ్యలో పుట్టిన బాలబాలికలు 5వ తరగతిలో ప్రవేశం కోసం విద్యార్థులు 5వ తేదీన స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు రావాలని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు స్టడీ, పుట్టిన తేదీ సర్టిఫికెట్లు తీసుకుని వచ్చి ఫిజికల్ పరీక్షల్లో పాల్గొనాలని తెలిపారు. ఫిజికల్ టెస్ట్‌లో ప్రావీణ్యం ఆధారంగా జిల్లా స్థాయికి పంపడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల పీఈటీలు పీడీలు పాల్గొనాలన్నారు.

భూములు కబ్జాదారుల చేతుల్లోకి..

నెల్లికుదురు: ప్రభుత్వ భూములు భూకబ్జాకోరుల చేతుల్లోకి వెళ్తుంటే కేసీఆర్ ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకుడు ఇస్సంపల్లి సైదులు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడారు. ప్రజాసమస్యలపై నేడు (సోమవారం) కలెక్టర్ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలని కోరుతూ వారంరోజులుగా గ్రామాల సర్వే నిర్వహించినట్లు తెలిపారు. నిరుపేదలు రైతులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని, ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని పేర్కొన్నారు.

సన్న బియ్యం పంపిణీ చేయాలి

నెహ్రూసెంటర్: రేషన్ దుకాణాల ద్వారా 12 రకాల వస్తువులను పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ పీవైఎల్ ఆధ్వర్యంలో నేడు హైదరాబాద్‌లోని సివిల్ సప్లై కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా ప్రధాన కార్యదర్శి పైండ్ల యాకయ్య పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన ప్రజలు రేషన్ దుకాణాల్లో ఇచ్చే బియ్యాన్నే తింటున్నారని, పెరిగిన ధరలను దృష్టిలో పెట్టుకుని రేషన్‌షాపుల ద్వారా వివిధ రకాల వస్తువులను రాయితీలతో ప్రభుత్వం పంపిణీ చేయాలని, రాయితీలు కార్పొరేట్లకు కాకుండా పేదలకు ఇవ్వాలన్నారు. రేషన్ దుకాణాల ద్వారా ప్రతి ఒక్కరికి 5కేజీల చొప్పున సన్న బియ్యాన్ని కేంద్రం పంపిణీ చేయాలన్నారు. పెరిగిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కొత్తరేషన్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు అనిల్, జిల్లా సహాయ కార్యదర్శి రంగయ్య, ప్రవీణ్, గంగరాజు పాల్గొన్నారు.

ప్రతీ రోజు నడకతో ఆరోగ్యానికి మేలు

మహబూబాబాద్ రూరల్: ప్రతి రోజు నడక, యోగా మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగజేస్తుందని డాక్టర్ టి.కుమారస్వామి అన్నారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్, వాసవి క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే వేడుకలను జిల్లా కేంద్రంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు కుమారస్వామి, వైదేహి, సతీష్, సాయికిరణ్, వివిధ ఉన్నత చదువుల పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించిన దాచేపల్లి అనుదీప్, తల్లాడ వంశీ, రాజ్ కుమార్, మాలే సృజన, పల్లపోతుల రికిన్ తదితరులను ఘనంగా సన్మానించారు. ఈగ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఐఈసీ ఆఫీసర్ మాలే యోగేశ్వరరావు, విశిష్ట అతిథులు రీజినల్ చైర్మన్ ఉల్లి శ్రీనివాస్, జోన్ చైర్మన్ మాలే శ్రవణ్, ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



వైద్యులు, విద్యార్థులకు సన్మానం

అన్నిసౌకర్యాలు కల్పించడమే ధ్యేయం



పెద్దవంగర: మంత్రిని కలిసిన నాయకులు

పెద్దవంగర: ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని కాన్వాయిగూడెం గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు, బీఆర్ఎస్ నేతలు, ప్రజాప్రతినిధులు ఆదివారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాసంలో మంత్రిని కలిసి గ్రామానికి అవసరమైన పలు అభివృద్ధి పనులపై మంత్రికి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కరుణ అంజనేయులు, ఉప సర్పంచ్ తాండాల చంద్రయ్య, మండల యూత్ అధ్యక్షుడు కాసాని హరీష్, గ్రామ అధ్యక్షుడు కాసాని కుమార్, నాయకులు జనగాం సత్యనారాయణ, సోమన్న, కర్ర అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

14న ఆయిల్‌పాం కంపెనీకి శంకుస్థాపన

తొర్రూరు రూరల్: ఈనెల 14న మండలంలోని గోపాలగిరిలో ఏర్పాటు చేయనున్న ఆయిల్‌ఫామ్ కంపెనీ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి దయాకర్‌రావు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఆయిల్‌పాం చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఎండీ సురేందర్, ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి మంత్రి ఎర్రబెల్లిని మర్యాదపూర్వకంగా కలిశారు.

కలెక్టర్ సీబీఎఫ్ కంప్లీట్

- నిధుల ఖర్చు విషయంలో నో గైడ్‌లైన్స్
- రెండేళ్లలో రూ.1.75కోట్లు విడుదల
- అత్యవసర పనులకు కేటాయింపు
- విద్యుత్, వైద్య రంగానికి ప్రాధాన్యం

మహబూబాబాద్: కలెక్టర్‌కు సంబంధించిన క్రూషల్ బ్యాలెన్సింగ్ ఫండ్ నిధులు అత్యవసర పనులకు కేటాయించారు. ఆ నిధుల ఖర్చు విషయంలో ఎలాంటి గైడ్‌లైన్స్ ఉండవని సంబంధిత అధికారులు తెలిపారు. రెండు సంవత్సరాల నిధుల అవసరాలను బట్టి వాటికి కేటాయించగా ఆ పనులు కూడా పూర్తయ్యాయి. కలెక్టర్ దృష్టికి వచ్చిన సమస్యలను బట్టి ఆ నిధులు కేటాయించారు. 2021-22లో సీబీఎఫ్ కింద కోటి రూపాయలు రాగా 2022-23లో రూ.75లక్షలు వచ్చినట్లు సీపీఓ అధికారులు తెలిపారు. కోటి రూపాయలలో చేసిన పనుల్లో కొన్ని పరిశీలిస్తే గూడూరు మండలంలోని బీముని పాదం, ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలు మరమ్మతులకు, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో శానిటేషన్, ఇతరత్రా వాటికి, జిల్లా కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం మరమ్మతులకు, జిల్లా గ్రంథాలయంలో ఫర్నిచర్‌కు కేటాయించగా అవి పూర్తి అయ్యాయి. రూ.75లక్షల్లో కొన్ని పనులు పరిశీలిస్తే ట్రాన్స్‌పార్మర్ల కోసం, పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ కోసం, నర్సింగ్ కళాశాలకు, బయ్యారంలో 108 భవనం మరమ్మతులకు, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి నిధులు కేటాయించగా ఆపనులు అన్ని పూర్తి అయ్యాయి. నిధులు వృధా కాకుండా ప్రజల అవసరాలను గుర్తించి వాటికి ఖెచ్చించారు. గతంలో కలెక్టర్‌గా పని చేసిన డాక్టర్ ప్రీతి మీనా ఆ సమయంలో ఆ నిధులతో ఆర్‌యూబీపై పెయింటింగ్‌కు, పార్కులకు, మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలకు ఇతరత్రా వాటికి ఖర్చు చేశారు.

రైళ్ల రద్దుతో ఇబ్బందులు

డోర్నకల్: డోర్నకల్ రైల్వే స్టేషన్ మీదుగా వెళ్లే పలు రైళ్ల రద్దును కొనసాగిస్తుండటంతో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లలో పనుల పేరుతో డోర్నకల్ రైల్వే స్టేషన్ మీదుగా నడిచే పుష్‌పుల్, సింగరేణి, భద్రాచలం రోడ్-విజయవాడ రైళ్లను గత నెల 19 నుంచి 25వ తేదీ వరకు రద్దు చేశారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి రద్దయిన రైళ్లను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

కేసముద్రం: కేసముద్రం నుంచి గూడూరు, తొర్రూరుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని పలుమార్లు కోరినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ ఆదివారం మండల కేంద్రంలో ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో నాయకులు చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు. ఈసందర్భంగా పార్టీ నాయకులు జాటోత్ బిచ్చానాయక్ మాట్లాడుతూ కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు చుట్టుపక్కల గ్రామాల నుంచి అనేక మంది రైతులు వచ్చి వెళ్తుంటారన్నారు. ఇందుకుగాను ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బానోతు సాయితేజ్, పానుగంటి సందీప్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరికలు

కురవి: మండలంలోని మొగిలిచర్ల గ్రామంలో ఆదివారం పలుపార్టీలకు చెందిన కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పోలేబోయిన కొమురయ్య, ఆళ్ల సురేష్ నేతృత్వంలో మండల నాయకుడు వద్దుల మహేందర్‌రెడ్డి సమక్షంలో బ్యాంక్ డైరెక్టర్ బోడ విజయరాము, మక్కల వీరన్న, సురేష్, పాపాచారీ, వినయ్‌చారీ, కందిపాటి వెంకటేశ్ తదితరులు పార్టీలో చేరారు.

నాయకుడి మృతి

బయ్యారం: మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తగిర అమృతారెడ్డి(85) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. బయ్యారం ఉపసర్పంచ్‌గా పనిచేసిన ఆయన జీవితాంతం కాంగ్రెస్ పార్టీ నాయకుడిగానే కొనసాగారు. ఆదివారం ఆయన మృతదేహానికి పూలమాలలు పలువురు నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే హరిప్రియ, జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి, జాతీయ నాయకుడు బెల్లయ్యనాయక్, ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ హరిసింగ్, వైస్ ఎంపీపీ గణేష్, సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సత్యనారాయణ, సర్పంచ్ కోటమ్మ, తదితరులు నివాళులర్పించారు.

గిరిజనాభివృద్ధికి సీఎం కృషి

ఖానాపురం : గిరిజనుల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని సర్పంచ్ బాలకిషన్ అన్నారు. ఈ మేరకు మండలంలోని నాజీతండాలో గిరిజనులకు పోడు పట్టాలు అందించడంతో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటాలకు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. అనేక సంవత్సరాలుగా పోడు సాగు చేసుకొని జీవిస్తున్న గిరిజనులకు అండగా కేసీఆర్ నిలిచాడన్నారు.

పూనం కోటేశ్వర్‌రావుకు నివాళి

గంగారం: సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా ఉమ్మడి వరంగల్ జిల్లా సీనియర్ నాయకులు పూనం ప్రభాకర్ ఏకై క కుమారుడు కోటేశ్వర్‌రావు అనారోగ్యంతో శనివారం రాత్రి ఎంజీఎం ఆస్పత్రిలో మృతిచెందాడు. గంగారం మండలంలోని పందెం గ్రామంలో ఆయన మృతదేహంపై సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కమిటీ నాయకులు హాజరై పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర నాయకులు, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాయల చంద్రశేఖర్, ఉమ్మడి జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న, సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, జిల్లా నాయకులు నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

అర్హులకు డబుల్ ఇళ్లు ఇవ్వాలి



సర్వే చేస్తున్న నాయకులు

కురవి: అర్హులైన పేదలందరికి డబుల్‌బెడ్రూం ఇళ్లు, పింఛన్లు, దళిత, గిరిజనబంధు ఇవ్వాలని తెలంగాణ గిరిజన సంఘం, రైతు సంఘం జిల్లా నాయకులు మాలోత్ కిషన్‌నాయక్, నల్లపు సుధాకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రం శివారులోని తులిస్యా తండా జీపీ పరిధిలోని పలు తండాల్లో సీపీఎం అనుబంధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సర్వే చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. నేడు జిల్లా కలెక్టరేట్ ఎదుట జరగబోయే ఆందోళనను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో దేఅవనాయక్, బాదావత్ సురేష్, బోడ సురేష్, పవన్, కల్యాణ్, రాజా, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా వనభోజనాల సందడి



కేసముద్రం: అమీనాపురంలో వనభోజనాలకు వెళ్తున్న గ్రామస్తులు

కేసముద్రం: మండలంలోని అమీనాపురం గ్రామంలో ఆదివారం గ్రామస్తులంతా వనభోజనాలకు వెళ్లారు. ఈ మేరకు సకాలంలో వర్షాలు కురవాలని, పంటలు పండాలని కోరుతూ వనదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం చెట్లకింద కుటుంబ సభ్యులు, బంధు, మిత్రులతో సహపంక్తి భోజనాలు చేశారు.

మహబూబాబాద్ రూరల్: వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని, పశు సంపద అభివృద్ధి చెందాలని వేడుకుంటూ జిల్లా కేంద్రంలోని వినాయక తరాడా ప్రజలు ఆదివారం ఊరిబయట వన భోజనాలకు వెళ్లారు. ఇష్ట దైవాలను పూజించి, మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా సందడి వాతావరణం నెలకొంది.

నేడే చివరి అవకాశం

ఖానాపురం : నూతనంగా పోడు పట్టాలు పొందుతున్న గిరిజన రైతులు రైతుబంధు సాయం కోసం సోమవారం సాయంత్రం వరకు తమ వివరాలు అందించాలని మండల వ్యవసాయ అధికారి బోగ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని అశోక్‌నగర్, ధర్మరావుపేట క్లస్టర్ల పరిధి నుంచి మరో 150మంది పోడు రైతులు ఆధార్, బ్యాంక్ ఖాతా పుస్తకాల జిరాక్స్‌లు అందించాల్సి ఉందన్నారు. వివరాలు అందిస్తేనే రైతుల ఖాతాల్లో రైతుబంధు జమ అవుతుందని తెలిపారు. రేపటి లోగా వివరాలు అందించకపోతే రైతు బంధును కోల్పోవాల్సి వస్తోందన్నారు.

మేము ఎవ్వరి భూమి ఆక్రమించుకోలేదు

దంతాలపల్లి: మేము ఎవ్వరి భూమి ఆక్రమంచలేదని గిరిజనులు తమ భూమిని ఆక్రమించారని మా కుటుంబ సభ్యులపై ఆరోపణలు చేయడం సరికాదని ఎంపీటీసీ రమణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడారు. తమ తండ్రిగారైన అనుమాండ్ల నారాయణరెడ్డి 1977లో మా అమ్మ అనుమాండ్ల పూలమ్మ పేరుపై ఆ భూమిని కొనుగోలు చేశాడన్నారు. అప్పటి నుంచి మేమే వ్యయసాయం చేస్తున్నామన్నారు. భూమికి సంబంధించిన అధారాలను ఆయన విలేకర్ల సమావేశంలో చూపారు. వారి దగ్గర మాకు భూమి కౌలుకు ఇచ్చినట్లు ఆధారాలు ఉన్నట్లైతే ఆ భూమిని వారికే అప్పగిస్తామన్నారు. అదే విధంగా ఇంట్లో మగవాళ్లు వివిధ పనులపై మండల కేంద్రానికి వెళ్లగా అదే అదునుగా చూసుకొని శనివారం తమ భూమిపై తిరగబడిన గిరిజనులు దాడి చేశాడన్నారు. కార్యక్రమంలో రైతుసమితి మండల కోఆర్డినేటర్ మల్లారెడ్డి, వెంకటరెడ్డి, మధుకర్‌రెడ్డి, సర్పంచ్ నెహ్రూనాయక్, బాధితులు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.